# ఓ ఇంటి సా[రో]రా కథ

రచన : శ్రీ తమ్మిశెట్టి రామారావు.

"ఏమండీ! ఈ రోజు స్పెషాలిటీ ఏమిటో చెప్పుకోండి చూద్దాం!" అంది భర్తకి టిఫిన్ కారేజ్ అందిస్తూ శకుంతల.

"ఏముంది! ఈరోజు ఫస్టుతారీఖు. జీతం అందుతుంది! అన్నాడు ఆనందరావు భార్య చేతిని అందంగా నొక్కి పెడుతూ.

"చాల్లెండి పోకిరిచేష్టలు. అవతల బేబీ... ఇవాళ మన బేబీ పుట్టిన రోజని గుర్తుందా?"

"సారీ శకుంతల! నాకా విషయం గుర్తే లేదు. మన బేబీ ఫిబ్రవరి ఫస్టునేకదూ పుట్టింది ఇక సంతానమే లేదనుకున్న మనకు, ఈరోజునే మన ఇంటిలో ఆశా జ్యోతి వెలిగింది. మన మెంత అదృష్టవంతులం!" ఆక్షణంలో ఆనంద రావులో ఆనంద కిరణం తళుక్కున మెరిసింది.

"అందుకే మన బేబీకి పుట్టిన రోజు పండుగ చేద్దామండి. మధ్యాహ్నం మీరు ఆఫీసుకి శెలవు పెట్టి వచ్చేటప్పుడు పాపకి ఫ్రాకూ... కేకూ వగైరా కొని పట్రండి. మీ కోసం ఎదురు చూస్తుంటాను. ఈ రోజు చాలా విలువైంది. ఎన్ని పనులున్నా త్వరగా ముగించుకుని వచ్చెయ్యాలి, మరిచిపోకండి" గోముగామందలిస్తూ చెప్పింది శకుంతల.

"తప్పకుండా శకుంతలా! బేబీ పుట్టిన రోజు పండగ కన్నా మనకి ఇతర విషయాలేం అంత ముఖ్యమని? నీవు చెప్పినట్లే వచ్చేస్తాను. మీరు సిద్ధంగావుంటే ఫస్టుషోకి వెళ్దాం కూడ."

ఆనందరావు బూట్లు టకటక లాడించు కుంటూ ఆఫీసుకి దారి తీశాడు. గుమ్మం దగ్గరికి వచ్చి భర్తకి బేబీ చేత 'టాటా' చెప్పించింది శకుంతల.

ఫస్టుతారీంకటేనే తల పట్టుకు కూర్చుం టుంది శకుంతల. కానీ ఈవేళ చాలా హుషారుగావుంది. ఏమిటో మధ్య తరగతి జీవితం... చాలీ చాలని జీతం ఏది కొరతపడినా చిరాగ్గానే వుంటుంది. ఆ వచ్చిన జీతపు రాళ్ళతో నెలల్లా నెట్టుకు రావాలి. పాలవాడికి, కాయగూరలమ్మికి, వెచ్చాల కొట్టువాడికి జీతం అందగానే ముడుపు చెల్లించెయ్యాలి. బొగ్గుల బస్తా తెప్పించుకోవాలి బేబీకి హార్లిక్సు సీసా కొనాలి అన్నీ సమస్యలే.

ఈ మధ్య ఆనందరావులో మార్పు ఒకటి వచ్చిపడింది. జీతం అందుకుని తిన్నగా ఏ బార్ కైనా వెళ్ళి పోతాడేమోనన్న భయం... శకుంతల కొంతసేపు తర్జన భర్జన పడ్డతర్వాత, అనుమానాలనన్నింటిని అటకమీద పెట్టి సమస్యలన్నింటికీ సర్దుబాటు మార్గం ఆలోచించుకుంది. లేని వుత్సాహాన్ని తెచ్చుకుని చక చకా పనులు చక్క బెట్టింది. తీరుబాటుగా కూర్చుని బేబీకి ముస్తాబు చేసింది. మధ్యాహ్నం గడిచింది.

ఇరుగనీ పొరుగునీ బొట్టుపెట్టి పిలిచింది. భర్త రాక కోసం చూడసాగింది. క్షణక్షణానికి శకుంతలలో నైరాశ్యం పెరిగిపోతోంది. పేరంటానికి పిల్చిన పిల్లా, పెద్దా, అంతా ఒక్కొక్కరే చల్లగా జారుకుంటున్నారు.

"ఇదిగో వాళ్ళ నాన్నగారు వచ్చేస్తాం టారు, అదిగో వాళ్ళనాన్నగారు మార్కెట్టుకు వెళ్ళి అన్నీకొని పట్టుకొనివచ్చేస్తుంటారు" అంటూ సర్ది చెప్పుకుంటోంది శకుంతల. చివరికి

ఆమెలో ఆ ఆశాజ్యోతి కొడిగట్టసాగింది. సంధ్య చీకటి పడుతోంది. శకుంతల బేబీని వడిలో పడుకో బెట్టుకుని గుమ్మానికి చేరబడింది.

"శకుంతలా! బేబీకి పుట్టిన రోజు పండుగ చేసావా? పెందరాళే వచ్చేద్దామనకున్నాను. తోవలో ఫ్రెండ్సు తగిలారు, క్లబ్బుకిక్కెళ్ళాను, అందుకే ఆలస్యమైంది. ఏమనుకోకు" తాగిన మైకంలో ఇంకా వూగుతూనే అన్నాడు ఆనందరావు.

ఏమండీ!... మీరు!... మీరు!... తాగి తాగివచ్చారా?... బేబీకి పుట్టినరోజని చెప్పా చెప్పానే... ఫ్రాకూ... కేకూ కొని తెమ్మన్నానే కనీసం ఈ ఒక్కరోజైనా... పుట్టెడు దుఃఖం ముంచుకువచ్చి గొంతుపెగల్లేదు శకుంతలకి.

"సారీ! శకుంతల అదంతా మర్చిపోయాను కావలిస్తే నువ్వే వెళ్ళికొని తెచ్చుకో ఈ నెల జీతంలో అప్పులవాళ్ళకి పోగా, ఓ వంద రూపాయలు మిగిలాయి. తీసుకో" అంటూ జేబులోంచి పది పదిరూపాయల కాగితం తీసి శకుంతల మీదకి విసిరాడు.

"ఏమండీ! జీతం ఏమీ మిగల్లేదా? అంతా తాగుడికి జల్సాలకే అయిపోయిందా? ఇంట్లో పెళ్ళాం పిల్లలు ఏమి తింటారనుకున్నారు? ఇంక మీతో వేగలేను. ఏనుయ్యో, గొయ్యో చూసుకోవలసిందే. తాగి తందనాలాడుతూ మీరే సుఖంగావుండండి." పిచ్చిదానిలా అరిచింది శకుంతల.

ఆనందరావు కోపం అవధులుదాటింది. శకుంతల చెంప ఛెల్లుమండి. బేబీ కేరుపెట్టి ఏడ్చింది. శకుంతలలో సహనంతో పాటు వూపిరికూడా పోయింది. ఈలోకంలో లేదు.

సాయం సంధ్య వేళ కాలుతున్న శకుంతల చితిమీద తనెప్పుడూ తాగనని ప్రమాణం చేసి ఇంటి ముఖం పట్టాడు ఆనందరావు.

# ఆణిముత్యాలు

★

"దరిద్రులు కొన్ని కోరుతారు. విలాస పురుషులు చాలా కోరుతారు. అత్యాశాపరులు అన్ని కోరుతారు".

—కాలే.

"ప్రజాసేవకుడు అమూల్యమైన కానుకలు స్వీకరించకూడదు".

—గాంధీజీ.

"వాక్కు అనేది చాలా గొప్పది. అంతకన్నా గొప్పది మౌనం".

—కార్లయి.

"పాతకోటు వేసుకో, కొత్త పుస్తకం కొనుక్కో".

—గాంధీజీ.

"ఇతరుల ప్రజ్ఞకు విలువనిచ్చేవాడు, ఇతరుల ఆనందాన్ని తన ఆనందంగా ఎంచేవాడు సుఖజీవి".

—గేట్.

"స్వర్గ నరకములు మానవుని చేతిలో ఉన్నవి".

—గాంధీజీ.

"తన్ను తానే ఉద్ధరించ కొనదగును తన్ను నశింపచేసి కొనరాదు. తనకు తానే బంధువు, తనకు తానే శత్రువు".

—గీత.

"ఇతరుల తప్పులు ఎంచకుము. నీ తప్పు నీవు తెలుసుకొనుము. అంతట నీవు హాయిగా సుఖింపగలవు. ఇతరుల తప్పులు వెదకుటకు ప్రారంభించిన చేతులు కాల్చుకొనుట తప్పదు."

—గాంధీజీ.